పత్రికాప్రకటన కాకినాడ, 28.11.2018

మహాత్మాజ్యోతిబా పూలే దేశానికి ఎనలేని సేవ చేసారని కుల, మత వర్గ విబేధాలు లేకుండ అందరూ సమానమేనని చాటిచెప్పిన మహానీయుడని ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుంకరపావని తిరుమలకుమార్ తెలిపారు. బుధవారంనాడు జీజీహెచ్ సెంటరులో గల మహాత్మాజ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతిబాపూలే విగ్రహనికి మేయర్ సుంకరపావని, సిటీ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలక్టరు ఎ.మల్లిఖార్జున, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా మేయర్ సుంకరపావని మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతి కోసం అంకితమై పనిచేసారని, అంటరానితనం నిర్మూలనకు కృషి చేసారని ఆమె తెలిపారు. మహిళలకు విద్య అవసరమని తలచి వారికి విద్యను అందించటానికి ఎంతో కృషించి పనిచేసారని మేయర్ చెప్పారు. ఆడపిల్లలకు విద్యనందించుటకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అలాగే వెనుకబడిన తరగతుల సంక్షేమం కొరకు విద్యార్థులను విద్యావంతులను చేయడానికి హాస్టల్స్, మెరుగైన విద్యను అందిస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో అసమానతలు తొలగించడానికి జ్యోతిబాపూలే కృషిచేసారని, వారి త్యాగాలు గుర్తుచేసుకొని భావితరాలకు వాటిని తెలియజేయాలని ఆయన తెలిపారు. భారతరాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంభేద్కర్, జ్యోతిబాపూలేను గురువుగా స్వీకరించి ఆయన ఆశయాలకు ఊపిరిపోశారన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జ్యోతిబాపూలే ఆశయాలను గుర్తించి వాటిని ప్రజలకు అందించడానికి చర్యలు చేపట్టారన్నారు. మహిళలకు చదువునేర్పడం ముఖ్యమని తలంచి ఆయన సతీమణి సావిత్రి పూలేకు విద్యను నేర్పించి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసి విద్యాభోదనకు కృషి చేసారని ఎమ్ఎల్ఎ తెలిపారు. వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు హాస్టల్స్, దుస్తులు, స్కాలర్ షిప్స్ అందజేస్తుందన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలక్టర్ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ మహత్మాజ్యోతిబాపూలే భారతదేశంలో సంఘ సంస్కరణలు ఎన్నో తెచ్చారని, వెనుకబడిన తరగతుల వారికి ఆయన చేసిన సేవ ఎనలేనిదని కొనియాడారు వెనుకబడిన వర్గాల వారికి జరిగే అన్యాయాలను ఎదిరించి నిలబడ్డారని, వారు చేసిన త్యాగం మరువరానిదని జెసి తెలిపారు. సమానహక్కులు కొరకు, కులవ్యవస్థ నిర్మూలనకు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధికి, సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కృషి చేసారని జెసి చెప్పారు. జ్యోతి బాపూలే 1890 నవంబరు 28వ తేదీన మరణించారని ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తుందని సమాజానికి సేవచేసిన త్యాగమూర్తులను స్మరించుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రాయితీ కల్పిస్తుందని చెప్పారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి కార్పొరేట్ విద్యాపథకం ద్వారా ఇంటర్మీడియట్‌లో కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి విద్యను ఉచితంగా అందజేస్తుందన్నారు. వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే నిమిత్తం జిల్లాలో బిసి స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ఇతర దేశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నవారికి 10లక్షల రూపాయలు చొప్పున ఈ సంవత్సరం జిల్లాలో 32 మంది బిసి విద్యార్థులకు 3.20కోట్ల ఖర్చుచేయడం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన అభ్యర్థులకు అఖిల భారత సర్వీసులలో ఉద్యోగాలు పొందటానికి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వీటిని బిసి విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థితికి ఎదిగి సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడాలని జెసి కోరారు.

ఈ కార్యక్రమంలో జెసి-2 సిహెచ్.సత్తిబాబు, బిసి కార్పొరేషన్ ఇడి ఎమ్.జ్యోతి, బిసిసంక్షేమాధికారి చినబాబు, వివిధ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

( సమాచారశాఖచే జారీ)